ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 209 | ఆదివారం 19, ఏప్రిల్ 2026 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# మేలో మరో పోరు!

**జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల దిశగా వేగం**
**ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఈసీ ఆదేశాలు**
**మే నెలలో ఎన్నికలు జరిగే అవకాశాలపై చర్చ**
**మండలాల వారీగా అదనపు ఓటర్ల గుర్తింపు ప్రక్రియ**
**పంచాయతీ, పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాలు**
**అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితా**
**గతంలో నిలిచిపోయిన ఎన్నికల ప్రక్రియకు కొత్త ఊపిరి**
**స్థానాల సంఖ్యలో మార్పులు, కొత్త పరిమాణాలు**
**అభ్యర్థుల్లో ఉత్సాహం, రాజకీయ చైతన్యం పెరుగుదల**




హైదరాబాద్, (ప్రజాస్వరం):
తెలంగాణలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు మళ్లీ వేగం అందుకున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం తాజా ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కదిలింది. ఓటర్ల జాబితా సిద్ధం చేయడంపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ కావడంతో ఎన్నికల ప్రక్రియకు తొలి అడుగు పడింది. కేంద్ర ఎన్నికల సంఘం నవీకరించిన ఓటర్ల జాబితాను ఆధారంగా తీసుకుని, కొత్తగా చేర్చిన ఓటర్ల వివరాలను సక్రమంగా గుర్తించి స్థానిక స్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ చర్యలతో ఎన్నికలు సమీపిస్తున్నాయన్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే వచ్చిన సమాచారం ప్రకారం పరిస్థితులు అనుకూలిస్తే మే నెలలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో న్యాయపరమైన ఇబ్బందుల కారణంగా ..మిగతా 2లో

# దక్షిణాది రాష్ట్రాలకు కాంగ్రెస్ అన్యాయం

**బండి సంజయ్ తీవ్ర విమర్శలు**
**లోక్‌సభలో బిల్లు వీగిపోవడంపై ఆగ్రహం**
**దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరిగిందన్న ఆరోపణ**
**కాంగ్రెస్, ఇండి కూటమిపై తీవ్ర విమర్శలు**
**నియోజకవర్గాల పునర్విభజనపై ఆందోళనలు**
**కేంద్ర హామీలను విస్మరించారన్న ఆరోపణ**
**మహిళా ప్రాతినిధ్య అంశంపై వాదోపవాదాలు**



హైదరాబాద్, (ప్రజాస్వరం):
లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ..మిగతా 2లో

# నేనే శాంతి దూతను

**మరో సారి ట్రంప్ సంచలన ప్రకటన**
**ప్రపంచ యుద్ధాలు తానే ముగించానన్న ట్రంప్నా**
**నాటోపై తీవ్ర విమర్శలు**
**భారత్-పాక్ యుద్ధాన్ని నిలిపినట్టు ప్రకటన**
**ఇరాన్ యురేనియంపై వివాదాస్పద వ్యాఖ్యలు**
**ఇజ్రాయెల్-లెబనాన్ కాల్పుల విరమణపై స్పందన**
**ఇరాన్ నుంచి తీవ్ర ప్రతిస్పందన**
**హర్మూజ్ జలసంధి అంశంపై తాజా పరిణామాలు**
**నాటో కూటమిని 'పేపర్ టైగర్'గా విమర్శ**
**ప్రపంచ రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీసిన వ్యాఖ్యలు**


హైదరాబాద్, (ప్రజాస్వరం):
అమెరికా రాజకీయ వేదికపై మరోసారి సంచలన వ్యాఖ్యలతో డొనాల్డ్ ట్రంప్ చర్చనీయాంశంగా మారారు. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న పలు ఘర్షణలను తానే పరిష్కరించానని పేర్కొంటూ తనను తాను శాంతి దూతగా అభివర్ణించారు. అమెరికాలో నిర్వహించిన టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ..మిగతా 2లో



# హర్మూజ్‌పై ఇరాన్ కట్టుదిట్టం

**నౌకాయానానికి కఠిన నిబంధనలు**
**సముద్ర మార్గంపై ఇరాన్ పూర్తి నియంత్రణ**
**అనుమతి లేకుండా నౌకలకు ప్రవేశం నిరాకరణ**
**అమెరికా వ్యాఖ్యలపై ఘాలిబఫ్ తీవ్ర స్పందన**
**దౌత్య చర్చల మధ్య ఉద్రిక్తతలు కొనసాగింపు**
**నిర్దేశిత మార్గాల్లోనే వాణిజ్య నౌకాయానం**
**ఐఆర్‌జీసీ నౌకాదళం కొత్త మార్గదర్శకాలు**
**ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావం**
**అమెరికా-ఇరాన్ చర్చలపై అంతర్జాతీయ ఆసక్తి**

హైదరాబాద్, (ప్రజాస్వరం):
పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టు మరింత బలపరిచింది. ప్రపంచానికి కీలకమైన ఈ సముద్ర మార్గంలో ..మిగతా 2లో



# బయ్యారం గ్రీన్ స్టీల్ ప్లాంట్‌కు మళ్లీ ఊపిరి



**కేంద్రాన్ని కోరిన సీఎం రేవంత్ రెడ్డి**
**ఢిల్లీలో కేంద్ర ఉక్కు మంత్రులతో కీలక భేటీ**
**గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదన**
**తెలంగాణ రైజింగ్–2047 విజన్‌పై చర్చ**
**హైదరాబాద్‌ను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళిక**
**ఈవీ బ్యాటరీలు, హైడ్రోజన్ టెక్నాలజీపై దృష్టి**
**మెషిన్ టూల్స్, రోబోటిక్స్ పార్క్ ప్రతిపాదన**
**బయ్యారం స్టీల్ ప్లాంట్ ఆలస్యంపై విమర్శలు**
**ఐరన్ ఓర్ నిల్వలతో భారీ అవకాశాల అంచనా**

హైదరాబాద్, (ప్రజాస్వరం):
తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త దిశగా అడుగులు వేస్తూ బయ్యారం గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశం మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్. డి. కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో సమావేశమై ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లారు. పర్యావరణానికి అనుకూలంగా ..మిగతా 2లో

# డీలిమిటేషన్ పేరుతో కేంద్రం కుట్ర

**కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు**
**మహిళా బిల్లులో కేంద్రం ఉద్దేశాలపై అనుమానాలు**
**విపక్షాల ఐక్యతతో బిల్లు ఆగిందని వెల్లడి**
**దక్షిణాది ప్రయోజనాల పరిరక్షణపై దృష్టి**
**2023 బిల్లు యథాతథంగా అమలుకు డిమాండ్**
**మహిళా రిజర్వేషన్లలో సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం**
**ఉత్తర-దక్షిణ విభజన రాజకీయాలపై విమర్శ**
**నిరసనలకు సిద్ధమని హెచ్చరిక**



హైదరాబాద్, (ప్రజాస్వరం):
మహిళా రిజర్వేషన్ బిల్లుపై దేశవ్యాప్తంగా కొనసాగుతున్న రాజకీయ చర్చల మధ్య తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న పేరుతో తీసుకువచ్చిన బిల్లు ..మిగతా 2లో

# హాట్ సమ్మర్‌లో చిల్డ్ బీర్లతో చిల్..

## రికార్డుస్థాయిలో బీర్ల సేల్స్..

**ఎండల కారణంగా భారీగా పెరిగిన బీర్ వినియోగం**
**కేసులకు కేసులు అమ్ముడుపోతున్న బీర్లు**
**కోట్ల లీటర్ల బీరు మార్కెట్లోకి వస్తోంది**
**మ్యాచ్‌లు చూస్తూ బీర్ తాగే ట్రెండ్ పెరుగుతోంది**
**బీర్ సేల్స్ పెరుగడంతో అబ్కారీ శాఖకు భారీ ఆదాయం**
**భవిష్యత్తులో రికార్డు స్థాయి అమ్మకాల అంచనా**

హైదరాబాద్, (ప్రజాస్వరం):
ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటలకే నడి నెత్తిన సూర్యారావ్ మంటెక్కించేస్తున్నాడు. ఎక్కడ చూసినా నలభై మూడు డిగ్రీలకు పైగానే టెంపరేచర్లు నమోదవుతున్నాయి. ప్రతిసారి ఏప్రిల్, మే నెలల్లో ఎండల భగ్గుమంటే, ఈసారి మార్చి నుంచే భానుడు నిప్పులు కురిపించడం మొదలెట్టాడు. జనాలు చల్లటి పానీయాల వైపు మొగ్గుచూపుతున్నారు. మందుబాబులు మాత్రం కూల్‌గా బీర్లు తాగేస్తున్నారు. మలమలమాడే ఎండకు చిల్డ్ బేరేసి ..మిగతా 2లో



# మేలో మరో పోరు!

మొదటిపేజీ తరువాయి

నిలిచిపోయిన ప్రక్రియను ఈసారి పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని దశలను వేగంగా పూర్తి చేయాలని అధికార యంత్రాంగానికి సూచనలు అందాయి.
కేంద్ర ఎన్నికల సంఘం 2025 జూలై 10 నుంచి 2026 ఫిబ్రవరి 5 వరకు నవీకరించిన ఓటర్ల జాబితాలోని మార్పులను రాష్ట్ర ఎన్నికల సంఘం పరిశీలించింది. అందులో నియోజకవర్గాల వారీగా పెరిగిన ఓటర్ల వివరాలను మండలాల ప్రకారం విభజించి గుర్తించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలను మినహాయించి మిగిలిన అన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది .ఈ వివరాల ఆధారంగా గ్రామ పంచాయతీలు, పోలింగ్ కేంద్రాల వారీగా కొత్త ఓటర్ల జాబితాలను రూపొందించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి జిల్లా పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో పని జరగాలి. తయారైన జాబితాలను సంబంధిత అధికారుల ధ్రువీకరణ అనంతరం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాలతో అనుసంధానం చేయాలి. సాంకేతికంగా ఏవైనా లోపాలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి సరిదిద్దాలని స్పష్టం చేశారు.
ఓటర్ల జాబితాలో తేడాలు ఉన్నట్లయితే వాటిని ఈ నెల 23లోపు ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుంది. అందిన సమాచారం ఆధారంగా పరిశీలన చేసి ముసాయిదా జాబితాలను విడుదల చేయనున్నారు. ఈ ముసాయిదా జాబితాలపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి తుది జాబితాను రూపొందిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకం వంటి తదుపరి చర్యలు చేపడతారు.గతంలోనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ కొన్ని కారణాల వల్ల అది నిలిచిపోయింది. 2019 మే నెలలో చివరిసారిగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత ఫలితాలు ప్రకటించి స్థానిక సంస్థల ప్రతినిధులను ఎన్నుకున్నారు. వారి పదవీకాలం గత ఏడాది జూన్‌తో ముగియడంతో అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పాలన కొనసాగుతోంది.
ఎన్నికల నిర్వహణకు గత ఏడాది సెప్టెంబర్ 29న నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. అయితే రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో అక్టోబర్ 9న ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను నిలిపివేశారు. తర్వాత న్యాయస్థానం అనుమతితో గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు రిజర్వేషన్ల విధానం స్పష్టతకు రావడంతో మిగిలిన స్థానిక సంస్థల ఎన్నికలను కూడా పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల వివరాలను సిద్ధం చేసి ఎన్నికల సంఘానికి అందజేసింది. తాజా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 566 జడ్పీటీసీ స్థానాలు, 5,773 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాను అర్బన్ జిల్లాగా పరిగణించడం వల్ల




జిల్లా పరిషత్‌ల జాబితాలో మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 31 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి.
గతంలో జరిగిన పరిపాలనా మార్పుల కారణంగా కొన్ని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలు, నగరపాలికల్లో విలీనమయ్యాయి. దీనివల్ల గ్రామాల సంఖ్య తగ్గింది. ఫలితంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల సంఖ్యలో కూడా తగ్గుదల కనిపించింది. మొత్తం 44 ఎంపీటీసీ, నాలుగు జడ్పీటీసీ, నాలుగు ఎంపీపీ స్థానాలు తగ్గినట్లు అధికారులు పేర్కొన్నారు.ఎన్నికలు సమీపిస్తున్నాయన్న సంకేతాలతో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. స్థానిక స్థాయిలో నాయకత్వం సాధించాలని ఆశించే అభ్యర్థులు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించారు. గ్రామ స్థాయిలో బలమైన మద్దతు కూడగట్టుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఇప్పటికే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు కీలకంగా మారాయి.
ఈ ఎన్నికలు స్థానిక పాలనలో కీలక పాత్ర పోషించే సంస్థలకు సంబంధించినవిగా ఉండటంతో రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఈ సంస్థల పాత్ర కీలకం. అందుకే ఈసారి పోటీ తీవ్రంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు రాజకీయ చర్చలు మరింత ఉధృతమయ్యే అవకాశాలు ఉన్నాయి.ఎన్నికల సంఘం తీసుకున్న తాజా నిర్ణయాలు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు మార్గం సుగమం చేస్తున్నాయి. ఓటర్ల జాబితా సిద్ధం నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ త్వరలోనే పూర్తి స్థాయిలో ఎన్నికల నిర్వహణ దశకు చేరుకునే అవకాశముంది. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చైతన్యం మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# దక్షిణాది రాష్ట్రాలకు కాంగ్రెస్ అన్యాయం

మొదటిపేజీ తరువాయి



బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. విపక్షాల వైఖరిని తీవ్రంగా విమర్శిస్తూ, దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. ముఖ్యంగా కాంగ్రెస్, ఇండి కూటమి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేశాయని ఆయన వ్యాఖ్యానించారు.
పార్లమెంట్‌లో దక్షిణాది ప్రయోజనాలను కాపాడే కీలక బిల్లును అడ్డుకోవడం చారిత్రక తప్పిదమని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. వెలుపల దక్షిణాది గౌరవం గురించి మాట్లాడే విపక్షాలు, లోక్‌సభలో మాత్రం ఆ ప్రాంతానికి మేలు చేసే చట్టాన్ని అడ్డుకోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. ఈ చర్య ద్వారా ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశారని విమర్శించారు.2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన కీలక అంశంగా మారింది. జనాభా ఆధారంగా సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు రాజకీయంగా వెనుకబడే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు అభివృద్ధి, విద్యపై దృష్టి పెట్టి ముందుకు సాగుతున్నప్పటికీ, సీట్ల తగ్గింపుతో వాటి ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉందని అన్నారు.
ఈ సమస్యకు పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం 131వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువచ్చిందని ఆయన వివరించారు. ఈ బిల్లు దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ కవచంలా పని చేసేదని, ప్రాతినిధ్య సమతుల్యతను కాపాడేదని తెలిపారు. అయితే విపక్షాలు రాజకీయ లాభాల కోసం ఈ బిల్లును అడ్డుకోవడం బాధాకరమని అన్నారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇచ్చిన హామీలను కూడా బండి సంజయ్ ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల సీట్లను పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం ప్రకటించినప్పటికీ విపక్షాలు స్పందించలేదని విమర్శించారు. ఈ హామీ ద్వారా ప్రాంతీయ సమతుల్యతను కాపాడాలని కేంద్రం ప్రయత్నించినట్లు తెలిపారు.
మహిళా ప్రాతినిధ్య అంశం కూడా ఈ బిల్లులో కీలక భాగమని ఆయన పేర్కొన్నారు. మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించేందుకు ఈ సంస్కరణ ఉపయోగపడేదని చెప్పారు. భవిష్యత్ తరాలకు సమాన అవకాశాలు కల్పించే దిశగా ఈ బిల్లు ఒక ముఖ్యమైన అడుగుగా ఉండేదని అభిప్రాయపడ్డారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం కృషి చేస్తోందని బండి సంజయ్ అన్నారు. అయితే విపక్షాలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కీలక సంస్కరణలను అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ఈ వైఖరి ప్రజాస్వామ్యానికి హానికరమని అభిప్రాయపడ్డారు.
ఈ పరిణామాలపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడం భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ అంశం ఎన్నికల రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.ఈ వివాదం కేంద్రవిపక్షాల మధ్య రాజకీయ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేసింది. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలు భవిష్యత్‌లో మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. ప్రజలు ఈ పరిణామాలను ఎలా స్వీకరిస్తారన్నది రాబోయే ఎన్నికల్లో స్పష్టమయ్యే అవకాశముంది.

# డీలిమిటేషన్ పేరుతో కేంద్రం కుట్ర

మొదటిపేజీ తరువాయి



వెనుక నిజాయితీ లేదని ఆరోపించారు. బిల్లును మూడు వేర్వేరు ప్రతిపాదనల రూపంలో తీసుకువచ్చి, అసలు ఉద్దేశం డీలిమిటేషన్ అమలు చేయడమేనని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా రాజ్యాంగ నిర్మాణంలో మార్పులు తీసుకురావాలన్న ప్రయత్నం జరిగిందని వ్యాఖ్యానించారు.ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన సీఎం, విపక్షాల ఐక్యత వల్లే ఈ బిల్లు ముందుకు సాగలేదని తెలిపారు. ఇది సాధారణ రాజకీయ ఓటమి కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలపై వచ్చిన ప్రతిఘటన అని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ వేదికగా ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నామని స్పష్టం చేశారు.
మహిళా రిజర్వేషన్లపై ఇప్పటికే చట్టపరమైన వ్యవస్థ ఉన్నదని సీఎం వివరించారు. చిన్న సవరణలతోనే రిజర్వేషన్లు అమలు చేయవచ్చని అభిప్రాయపడ్డారు. కానీ కొత్త బిల్లుల ద్వారా అవసరంలేని మార్పులు తీసుకురావాలని ప్రయత్నించడం వెనుక వేరే ఉద్దేశాలు ఉన్నాయని అన్నారు. రిజర్వేషన్ల వ్యవస్థను బలహీనపరచాలన్న ప్రయత్నమే జరుగుతోందని విమర్శించారు.కేంద్రంపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, భారీ మెజారిటీ వస్తే రాజ్యాంగ మార్పులకు పాల్పడే అవకాశముందని సీఎం హెచ్చరించారు. ఈ నేపథ్యంలో విపక్షాలు అప్రమత్తంగా వ్యవహరించాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలపై తప్పుదోవ పట్టించే ప్రచారం జరుగుతోందని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉందని అన్నారు.
మహిళా రిజర్వేషన్ బిల్లును యథాతథంగా అమలు చేయాలని సీఎం డిమాండ్ చేశారు. 2023లో ప్రవేశపెట్టిన బిల్లును ఎలాంటి మార్పులు లేకుండా అమలు చేస్తే పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. మహిళలకు ప్రాతినిధ్యం పెరగడం సమాజ అభివృద్ధికి కీలకమని చెప్పారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు కూడా తగిన ప్రాధాన్యం కల్పించాలని సూచించారు.ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య విభజన సృష్టించే రాజకీయాలు ఆగాలని సీఎం అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి సమతుల్యంగా ఉండాలంటే అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు అవసరమని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా కేంద్రానికి కీలకంగా సహకరిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటం ముఖ్యమని అన్నారు.
మహిళా రిజర్వేషన్లపై తమకు పూర్తి నిబద్ధత ఉందని సీఎం స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే ఎన్నికల ముందు ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో అప్పుడు స్పష్టమవుతుందని సవాల్ విసిరారు. మహిళా సాధికారతకు అడ్డంకులు సృష్టించే చర్యలను సహించబోమని హెచ్చరించారు. రాజకీయ అవసరాల కోసం మహిళా రిజర్వేషన్ అంశాన్ని ఉపయోగించకూడదని సీఎం అన్నారు. ఈ విషయం దేశ ప్రయోజనాలకు సంబంధించినదని, అందరూ కలసి ముందుకు సాగాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ గతంలో మహిళల కోసం తీసుకున్న నిర్ణయాలను ప్రస్తావిస్తూ, తమ కట్టుబాటును వివరించారు.
లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందకపోవడంపై స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై విమర్శలు కొనసాగించారు. తప్పుడు విధానాలు కొనసాగితే గల్లీ నుంచి పార్లమెంట్ వరకు నిరసనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రవిపక్షాల మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఒకవైపు మహిళా సాధికారత అంశం, మరోవైపు రాజకీయ వ్యూహాలు కలిసి ఈ అంశాన్ని ప్రధాన చర్చగా నిలిపాయి. రాబోయే రోజుల్లో ఈ విషయంపై మరింత రాజకీయ పోరు కొనసాగనున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

# బయ్యారం గ్రీన్ స్టీల్ ప్లాంట్‌కు మళ్లీ ఊపిరి

మొదటిపేజీ తరువాయి

ఉండే గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా ఉక్కు కొరత తగ్గడంతో పాటు స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన వివరించారు.
ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను కేంద్రానికి వివరించారు. ముఖ్యంగా ఆధునిక సాంకేతికత ఆధారంగా పరిశ్రమలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పాత వాహనాల స్క్రాప్‌ను ఉపయోగించి ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ విధానం ద్వారా వనరుల వినియోగం మెరుగుపడటంతో పాటు కాలుష్యాన్ని కూడా తగ్గించవచ్చని పేర్కొన్నారు.హైదరాబాద్‌ను దేశ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. హైడ్రోజన్ టెక్నాలజీ ఆధారంగా గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఆటోమొబైల్, రక్షణ రంగాలకు అవసరమైన కీలక ఉత్పత్తుల తయారీకి అనుకూల వాతావరణం రాష్ట్రంలో ఉందని వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు అవసరమని పేర్కొన్నారు.
ఇదే సమయంలో మెషిన్ టూల్స్, రోబోటిక్స్ రంగాల్లో ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఆధునిక పరిశ్రమల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను స్థానిక యువతకు అందించేందుకు జాతీయ స్థాయి సంస్థలు అవసరమని తెలిపారు. దీని ద్వారా ఉద్యోగ అవకాశాలు విస్తరించే అవకాశం ఉందని చెప్పారు.హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2034 నాటికి వాహనాలన్నీ ఎలక్ట్రిక్ వాహనాలుగా మారేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ దిశగా కేంద్ర సహకారం కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధి సాధ్యమయ్యేలా సమగ్ర ప్రణాళిక అవసరమని తెలిపారు.
ఇక బయ్యారం స్టీల్ ప్లాంట్ అంశం గత కొన్నేళ్లుగా చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర విభజన అనంతరం ఈ ప్రాజెక్టు అమలు కాలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ బయ్యారం ప్రాజెక్టుపై నిర్లక్ష్యం చూపుతున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకుంది.బయ్యారం ప్రాంతంలో విస్తారమైన ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నట్లు గతంలోనే గుర్తించారు. సుమారు 1.41 లక్షల ఎకరాల్లో ఇనుము ఖనిజం లభ్యమవుతుందని అంచనా. ఈ వనరులను వినియోగించి స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే తక్కువ వ్యయంతో ఉత్పత్తి సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా స్థానికంగా వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశం చేర్చినా అమలులో ఆలస్యం జరగడం రాజకీయ చర్చకు దారితీసింది. దాదాపు పదేళ్లకు పైగా గడిచినా ప్రాజెక్టు ముందుకు సాగకపోవడంపై అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రాన్ని విమర్శిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తాజా భేటీతో ఈ ప్రాజెక్టుకు మళ్లీ ఊపిరి వస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి బయ్యారం గ్రీన్ స్టీల్ ప్లాంట్ కీలకంగా మారే అవకాశం ఉంది. పర్యావరణానికి అనుకూలమైన సాంకేతికతతో ఈ ప్రాజెక్టు అమలు అయితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించే అవకాశం ఉంది. కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తే ఈ ప్రాజెక్టు త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# నేనే శాంతి దూతను

మొదటిపేజీ తరువాయి

అంతర్జాతీయ రాజకీయాలపై తన పాత్రను విశేషంగా వివరించారు. ముఖ్యంగా భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగి యుద్ధంగా మారే పరిస్థితిని తానే నివారించానని పేర్కొనడం విశేషంగా నిలిచింది.
భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగి ఉంటే కోట్లాది ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఆ పరిస్థితిని తాను చర్చల ద్వారా సద్దుమణిగేలా చేశానని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది ప్రధాన యుద్ధాలను ముగించానని, ఇరాన్, లెబనాన్ పరిణామాలను కలుపుకుంటే మొత్తం పది ఘర్షణలను తానే నిలిపివేశానని వెల్లడించారు. ఈ చర్యల వల్ల లక్షలాది ప్రాణాలు కాపాడినట్టు ఆయన పేర్కొన్నారు.మధ్యప్రాచ్య పరిణామాలపై కూడా ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య ఎన్నో దశాబ్దాల తర్వాత కాల్పుల విరమణ సాధ్యమైందని, ఇది చారిత్రాత్మక ఒప్పందంగా నిలిచిందని ఆయన తెలిపారు. ఈ ఒప్పందంతో ఆ ప్రాంతంలో స్థిరత్వం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లెబనాన్ పరిస్థితిని నియంత్రణలోకి తీసుకురావడంలో అమెరికా పాత్ర కీలకమని పేర్కొన్నారు.
ఇరాన్ అంశంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరింత వివాదాస్పదంగా మారాయి. ఇరాన్‌తో కలిసి యురేనియంను తవ్వి అమెరికాకు తరలిస్తామని ఆయన ప్రకటించారు. పెద్ద యంత్రాల సహాయంతో ఈ ప్రక్రియను నిర్వహిస్తామని చెప్పడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశంలో ఉన్న యురేనియం తమకు అత్యంత విలువైనదని, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర దేశాలకు తరలించబోమని ఇరాన్ విదేశాంగ ప్రతినిధులు స్పష్టం చేశారు. అమెరికా చేస్తున్న ప్రకటనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని విమర్శించారు.హర్మూజ్ జలసంధి పరిణామాలపై కూడా ట్రంప్ స్పందించారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయని, వాణిజ్య నౌకాయానానికి మళ్లీ అనుమతులు లభిస్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ పూర్తి స్థాయి ఒప్పందం కుదిరే వరకు అమెరికా నౌకాదళం విధించిన నియంత్రణలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రపంచ చమురు, సహజ వాయువు సరఫరాలో కీలకమైన ఈ మార్గం తిరిగి సాధారణ స్థితికి రావడం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఉపశమనంగా మారే అవకాశం ఉందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.
నాటో కూటమిపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా తీవ్ర చర్చకు దారితీశాయి. అవసరమైన సమయంలో సహాయం అందించలేదని ఆరోపిస్తూ నాటోను 'పేపర్ టైగర్'గా అభివర్ణించారు. రెండు నెలల క్రితం సహాయం అవసరమైనప్పుడు స్పందించని కూటమి ఇప్పుడు పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత సహాయం అందిస్తామని చెప్పడం అర్థరహితమని విమర్శించారు. ఈ వ్యాఖ్యలు పాశ్చాత్య దేశాల మధ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంది.అమెరికా సైనిక శక్తిపై ట్రంప్ మరోసారి దృష్టిసారించారు. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన సైన్యం, నౌకాదళం తమదేనని పేర్కొన్నారు. హర్మూజ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులను నియంత్రించడంలో అమెరికా కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే పూర్తి స్థాయి ఒప్పందం కుదిరే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఇక ఇరాన్ వర్గాలు కూడా తమ వైఖరిని స్పష్టం చేశాయి. హర్మూజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకాయానానికి అనుమతులు ఉన్నాయని ప్రకటించాయి. అంతర్జాతీయ వాణిజ్యానికి ఎటువంటి అడ్డంకులు ఉండవని పేర్కొన్నాయి. అయితే అమెరికా విధించిన నియంత్రణలు కొనసాగుతుండటం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చే అవకాశముంది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రపంచ రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీశాయి. తాను శాంతి దూతగా వ్యవహరించానన్న ఆయన ప్రకటనలు, ఇతర దేశాలపై చేసిన విమర్శలు అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా నాటోపై చేసిన వ్యాఖ్యలు, ఇరాన్‌పై చేసిన ప్రకటనలు భవిష్యత్తులో మరిన్ని పరిణామాలకు కారణమయ్యే అవకాశం కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఈ వ్యాఖ్యలను ఎలా స్వీకరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.





## విపక్షాల తీరుపై బీజేపీ శ్రేణుల నిరసన

**(ప్రజాస్వరం)**
**మనోహరాబాద్ ఏప్రిల్ 18**

మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మనోహరాబాద్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్లమెంట్లో నారీ శక్తి మహిళా బిల్లును కాంగ్రెస్ మిత్ర పక్షాలు అడ్డుకోవడం మహిళలపై వారికున్న గౌరవాన్ని తెలుపుతుందని బీజేపీ మండల అధ్యక్షులు వెంకట్ గౌడ్, జిల్లా నాయకులు నరేందర్ చారి నాయకులు నత్తి మల్లేష్ తదితర నాయకులు విమర్శించారు.

## ఆడపిల్లలకు సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో టీకాలు

**గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి (ప్రజా స్వరం):**

గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో బాలికల ఆరోగ్య రక్షణకు ముఖ్యమైన కార్యక్రమం నిర్వహించారు. 14 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో టీకాలు వేయించారు. ఈ కార్యక్రమంలో జాలిగామ గ్రామ మాజీ ఎంపీటీసీ తాళ్ల ఆంజనేయులు గౌడ్ పాల్గొని బాలికలకు అవగాహన కల్పించారు,ఆశా వర్కర్ అరుంధతి, గ్రామ మహిళా గ్రూప్ అధ్యక్షురాలు సులోచన కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు,బాలికలు హాజరై టీకాలు తీసుకున్నారు,ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే నివారించడానికి టీకాలు ఎంతో అవసరమని తెలిపారు.



## బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం

- **మహిళా సాధికారతకు అడ్డుపడే పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారు**

**గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి 18 (ప్రజా స్వరం) :**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ మహిళా మోర్చా నాయకురాలు ఆలేటి సుమతి, చిలువేరి కుంకుమ రాణి మాట్లాడుతూ మహిళా సాధికారతకు అడ్డుపడే పార్టీలకు ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించడం జరిగింది బయట మహిళా హక్కులంటూ రాహుల్ గాంధీ ప్రగల్భాలు. చట్టసభల్లో మాత్రం మహిళా రిజర్వేషన్లను అడ్డుకునే కుతంత్రాలు కాంగ్రెస్ లోక్‌సభలో అడ్డుకున్నది కేవలం మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును మాత్రమే కాదు వారు అడ్డుకున్నది మహిళల ప్రగతిని మహిళల రాజకీయ సాధికారతను దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో సమతుల్యత లభించి అందరికీ న్యాయం జరిగే అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ దూరం చేసింది. సమతుల్య సహృద్భావ వాతాహరణాన్ని కలుషితం చేసి రాజకీయ ప్రయోజనాలు పొందాలనే కుటిల నీతిలో భాగమే ఈ చర్య. మహిళ నాయకత్వాన్ని అంగీకరించలేని అహంకారపూరిత కాంగ్రెస్ వైఖరిని ఈ దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరు.ఈ కార్యక్రమంలో దాతర్ పల్లి సర్పంచ్ బాసు రాజు సిద్దిపేట జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యులు వెంకటరెడ్డి పట్టణ మండల ప్రధాన కార్యదర్శిలు నాయిని సందీప్ కుమార్, మడుగురి నరసింహా, ఇప్ప స్వామి, పట్టణ మహిళా మోర్చా కార్యదర్శి సరిత, మహిళా నాయకురాలు స్వరాజ్యలక్ష్మి మండల పట్టణ నాయకులు బాచిని శివప్రసాద్, కర్నాల శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, సంద అశోక్, పవన్ కుమార్, అరవింద్ రెడ్డి, గణేష్ మహేందర్ స్వామి, మల్లేశం, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు





# నో హెల్మెట్ నో ఎంట్రీ...

- **హెల్మెంట్ లేకుండా వస్తే జరిమానా...**
- **మోడల్ గ్రామంగా వల్లభాపూర్.. ఎస్ఐ సృజన**

**ప్రజా స్వరం నార్సింగి ఏప్రిల్ 18**

"నో హెల్మెట్ నో ఎంట్రీ" నినాదంతో వల్లభాపూర్ గ్రామాన్ని రోడ్డు భద్రతలో మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడం కోసం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అంతర్గతంగా స్థానిక ఎస్ఐ బీమరి సృజన, సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సీఐ వెంకట రాజు గౌడ్, మాజీ జడ్పీటీసీ బాణాపురం కృష్ణా రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ బాణాపురం కృష్ణా రెడ్డి తన స్వంత నిధులతో గ్రామస్థులకు ఎనభై హెల్మెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. సీఐ వెంకట రాజు గౌడ్, జడ్పీటీసీ కృష్ణా రెడ్డి, జాతీయ రహదారి సంస్థ ప్రోగ్రాం ఎగ్జిక్యూటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో హెల్మెట్ వాడక పోవడంతో ఎక్కువ శాతం మరణాలు సంభవిస్తున్నాయి అని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు వల్లభాపూర్ ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో భాగంగా హెల్మెట్ లేనిదే గ్రామంలో ప్రవేశం లేదని, అందుకే హెల్మెట్లు పంపిణీ చేశామని, ప్రతి గ్రామస్థుడు విధిగా హెల్మెట్ ధరించాలని, లేక పోతే గ్రామ స్థాయిలో జరిమాన విధిస్తామని అన్నారు. తనకు డబ్బుల కన్నా తన ప్రజల ప్రాణాలే తనకు ముఖ్యమని, అందుకే గ్రామస్థుల క్షేమం కోసం ఉచితంగా హెల్మెట్ పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అనంతరం వల్లభాపూర్ కు చెందిన రోడ్డు ప్రమాద బాధిత కుటుంబ సభ్యులు తమ వారు ప్రమాద సమయంలో



హెల్మెట్ ధరించి ఉంటే, ప్రాణాలు పోకుండా ఇతర గాయాలతో అయిన కనీసం తమ మధ్య ఉండేవారని, తమ కుటుంబాలు పడుతున్న ఆవేదన ఇతరులు పడకుండా హెల్మెట్ ధరించడంతో పాటు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ఎస్ఐ బీమరి సృజన మాట్లాడుతూ తాను ఏడవ తరగతిలో చదువుతున్నప్పుడు తన తండ్రి రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నారని, ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ధరించి ఉంటే తాను తమ మధ్య ఉండేవారని గుర్తు చేసుకుంటూ కంట తడి పెట్టారు. ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించి ఉండడం వల్ల హెల్మెట్ పగిలినా తలకు గాయాలు అవ్వలేవని, కాళ్ళు చేతులకు తీవ్ర గాయాలు అయినా తాను ప్రాణాలతో బయట పడి మీ ముందు ఉన్నానని, అందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని విలేఖరి సలీం షేక్ విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని నాయకులు, పోలీస్ అధికారులు, గ్రామ ప్రజలతో పాటు ప్రమాణం చేశారు. కార్యక్రమం చివరలో హెల్మెట్ ప్రాముఖ్యత, రోడ్డు భద్రతా నియమాల పై అవగాహన కోసం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వల్లభాపూర్ ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



## జల్సాలకు కోసం వరుస దొంగతనాలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్.....

- **సుమారు 2 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, 25348 రూపాయల నగదు స్వాధీనం...**

**మెదక్ ఏప్రిల్ 18 (ప్రజా స్వరం)**

జల్సాల కోసం తాళం వేసిన ఇళ్ల, దేవాలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ ను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు పట్టణ సీఐ మహేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ లో పట్టణ సీఐ మహేష్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ పట్టణం మిలటరీ కాలనీ లోని హనుమాన్ దేవాలయంలో దొంగతనం జరిగిందని మాణిక్యాల చంద్రశేఖర్ మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. ఈ కేసు విచారణ లో భాగంగా పట్టణంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మాచబోయిన మహేష్ కుమార్ ను అదుపులోకి తీసుకుని విచారించడం దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో హనుమాన్ దేవాలయంలో దొంగలించిన 0.54 గ్రాముల బంగారు పుస్తేల బిళ్ళలు, 1.66 గ్రాముల వెండి, 5 వేల నగదు, 348 రూపాయల నాణేలు, 5348 విలువ గల వస్తువులు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ నిందితుడి పైన మెదక్ పట్టణం తో హవేలీ ఘనపూర్, పాపన్నపేట లో మొత్తం 10 దొంగతనాల కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితుడు తాళం వేసిన ఇళ్లల్లో బీరువాలను పగల గొట్టి దొంగతనాలు చేస్తూ దొంగలించిన డబ్బు ను జల్సాలకు, అమ్మాయిలతో సరదాగా గడిపేందుకు ఉపయోగించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి మొత్తం సుమారు 2 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, 25348 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసు చేదన కృషి చేసిన సీసీఎస్ సీఐ రాజశేఖర్ రెడ్డి టీం కానిస్టేబుల్స్ సల్మాన్ ఖాన్, చిట్టిబాబు, సిహెచ్ ప్రశాంత్, బి. ప్రశాంత్, పట్టణ కానిస్టేబుల్స్ మల్లేశం, నిఖిల్ రెడ్డి నీ ఆయన అభినందించారు.





ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక
19-04-2026
ఆదివారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


# హర్మూజ్‌పై ఇరాన్ కట్టుదిట్టం

మొదటిపేజీ తరువాయి

ఇకపై నౌకాయానం పూర్తిగా తమ నియంత్రణలోనే కొనసాగుతుందని ఆ దేశ నాయకత్వం స్పష్టం చేసింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే ఇరాన్ అనుమతి తప్పనిసరి అని ప్రకటించడంతో అంతర్జాతీయ వాణిజ్య రంగంలో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా చమురు రవాణాలో కీలకమైన ఈ మార్గంపై కట్టుదిట్టమైన నియంత్రణలు విధించడం గ్లోబల్ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశముంది.ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ ఈ అంశంపై స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందని, అవసరమైతే దానిని మూసివేయడానికి కూడా వెనుకాడబోమని తెలిపారు. అమెరికా చేస్తున్న ప్రకటనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని విమర్శిస్తూ, తమ నౌకా రాకపోకలను అడ్డుకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దౌత్య చర్చలు జరుగుతున్న సమయంలో ఈ తరహా వ్యాఖ్యలు పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

ఇరాన్ విదేశాంగ వర్గాలు కూడా ఇదే దృక్పథాన్ని వ్యక్తం చేశాయి. హర్మూజ్ జలసంధి వినియోగంపై స్పష్టమైన విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నాయి. నౌకలు కేవలం నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాల్సి ఉంటుందని, ప్రతి నౌకకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. అవసరమైతే ఈ మార్గాన్ని మూసివేయడానికీ సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు. ఈ ప్రకటనలు అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన ఈ మార్గంపై అనిశ్చితిని పెంచుతున్నాయి.

ఇదే సమయంలో ఇరాన్ విదేశాంగ మంత్రి హర్మూజ్ జలసంధిని తాత్కాలికంగా తెరవనున్నట్లు ప్రకటించారు. లెబనాన్ ప్రాంతంలో కాల్పుల విరమణ అమలులోకి రావడంతో వాణిజ్య నౌకాయానానికి అనుమతి ఇస్తున్నట్లు వెల్లడించారు. అయితే ఈ అనుమతి పూర్తిగా షరతులతో కూడినదేనని స్పష్టం చేశారు. నౌకలు నిర్ణయించిన మార్గాల్లోనే ప్రయాణించాలి, అధికారుల అనుమతి తీసుకోవాలి అనే నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఈ పరిణామాలకు పరోక్ష కారణంగా భావిస్తున్నారు. ఈ ఒప్పందం వల్ల ప్రాంతంలో కొంతమేర ఉద్రిక్తత తగ్గినప్పటికీ, పూర్తి స్థాయి స్థిరత్వం ఇంకా నెలకొనలేదని విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే ఇరాన్ జాగ్రత్త చర్యల భాగంగా హర్మూజ్ జలసంధిపై నియంత్రణ కొనసాగిస్తోంది.

మరోవైపు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నౌకాదళం కూడా కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. అన్ని వాణిజ్య నౌకలు తమ అనుమతితోనే ప్రయాణించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ముఖ్యంగా సివిలియన్ నౌకలు నిర్దేశిత మార్గాల్లోనే కదలాలని పేర్కొంది. సైనిక నౌకలకు అనుమతి ఉండదని చెప్పడం ఈ ప్రాంతంలో భద్రతా పరిస్థితులను మరింత కఠినతరం చేస్తోంది. హర్మూజ్ జలసంధి ప్రపంచ చమురు సరఫరాలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారానే రవాణా అవుతుంది. అందువల్ల ఈ ప్రాంతంలో ఏ చిన్న మార్పు జరిగినా అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం తప్పదు. ఇరాన్ విధించిన పరిమితులు, హెచ్చరికలు చమురు ధరల్లో అస్థిరతకు దారితీసే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఇదిలా ఉండగా అమెరికాఇరాన్ మధ్య దౌత్య చర్చలు కొనసాగుతున్నాయి. త్వరలోనే రెండో విడత చర్చలు జరగనున్నట్లు సమాచారం. ఈ చర్చలు పాకిస్థాన్ వేదికగా జరిగే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షలు, భద్రతా అంశాలు ప్రధాన చర్చా విషయాలుగా ఉండే అవకాశం ఉంది. ఇరాన్ తన ఆర్థిక ఆస్తులపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కోరుకుంటోంది.హర్మూజ్ జలసంధి అంశం అంతర్జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారింది. ఒకవైపు దౌత్య చర్చలు కొనసాగుతుండగా మరోవైపు పరస్పర ఆరోపణలు, హెచ్చరికలు పరిస్థితిని క్లిష్టతరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే చర్చలు ఏ దిశగా మలుపుతిప్పుతాయన్నది ప్రపంచవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. ఈ సమస్య పరిష్కారం అంతర్జాతీయ వాణిజ్యం, భద్రతా పరిస్థితులపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశముంది.



# హాట్ సమ్మర్‌లో చిల్డ్ బీర్లతో చిల్..

మొదటిపేజీ తరువాయి

చిల్లవుతున్నారు. దాంతో బీర్ల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కేసులకు కేసులు రాగించేస్తుండటంతో... కోట్ల లీటర్ల బీరు మార్కెట్లోకి ఏరులై పారుతోంది. ఒక్క హైదరాబాద్ పరిధిలోనే రోజుకు వేలాది కేసుల బీర్లు అమ్ముడవుతున్నాయి. వాతావరణానికి తోడు ఐపీఎల్ కూడా తోడుకావడంతో మ్యాచ్ చూస్తూ పీపాలకు పీపాలు లేపేస్తున్నారు. మద్యానికి బదులు బీర్లు తాగేవారు ఎక్కువయ్యారు. బీర్ డిమాండ్ వీకెండ్స్ కు రెట్టింపైంది. ముమ్ముందు బీర్ సేల్స్ రికార్డు స్థాయికి చేరుతాయంటున్నారు. బీర్ల సేల్స్ పెరిగేకొద్దీ అబ్కారీ శాఖ ఖజానా కళకళలాడుతోంది.

దేశవ్యాప్తంగా 2026 మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు తీవ్రంగా ఉండటంతో బీర్ అమ్మకాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో, అందునా తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి అమ్మకాలు నమోదయ్యాయి. తెలంగాణలో ఈ మార్చిలో ఏకంగా 50 లక్షల కేసులకి పైగా బీర్ అమ్ముడైంది. ఇది గత ఏడాది అమ్మకాలతో పోలిస్తే 22 శాతం ఎక్కువ. ఏప్రిల్ మొదటి 13 రోజుల్లోనే దాదాపు 21 లక్షల కేసులు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం ప్రతిరోజూ సగటున 1.7 లక్షల నుంచి 1.8 లక్షల కేసుల సేల్స్ జరుగుతున్నాయి. సాధారణ రోజుల్లో రోజుకు 1.50 లక్షల కేసులు అమ్ముడైతే, ఇప్పుడు అది 2 లక్షలకు చేరింది. ఎండలు పెరిగే కొద్దీ ఇది 2.5 లక్షలకు చేరవచ్చని అంచనా.

హైదరాబాద్ వంటి నగరాల్లో ప్రీమియం,ఫారిన్ బ్రాండ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. సాధారణంగా ఏడాదికి 450500 లక్షల కేసులు అమ్ముడవుతుంటాయి, కానీ ఈ ఏడాది అది 600 లక్షల కేసులను దాటుతుందని అంచనా వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర మెట్రో నగరాలైన ముంబై, బెంగళూరు, ఢిల్లీలలో కూడా బీర్ అమ్మకాలు సుమారు 15శాతం నుండి 20శాతం వరకు వృద్ధిని కనబరుస్తున్నాయి. యువతలో క్రాఫ్ట్ బీర్లు, తక్కువ ఆల్కహాల్ ఉండే బీర్ల పట్ల ఆసక్తి పెరగడం కూడా ఈ వృద్ధికి ఒక కారణంగా కనిపిస్తోంది. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఉత్పత్తికి అవసరమైన నీటి కొరత, ముడి పదార్థాల ధరల పెరుగుదల వల్ల సరఫరాపై కొంత ఒత్తిడి కూడా ఉంది. బార్‌లు, రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు బీర్ స్టాక్‌ను సిద్ధంగా ఉంచుకుంటున్నాయి. ఇప్పుడు అన్ని రకాల ప్రీమియం బ్రాండ్లు అందుబాట్లో వుండడంతో ఈ సమ్మర్ హీట్ చిల్ అవుతుందంటున్నారు వ్యాపారులు. స్టాక్ త్వరగా ఖాళీ అవుతుండటంతో డీలర్లు అడిషనల్ కార్టన్ల కోసం డిపోల చుట్టూ తిరుగుతున్నారు. మామూలుగా వారానికి ఒక్కసారి స్టాక్ తెప్పించుకునేవాళ్లు. కానీ ఇప్పుడు నాలుగు రోజులకు ఒకసారి తెప్పించాల్సిన పరిస్థితి. ఆ స్థాయిలో సేల్స్ పెరిగాయి. ఈవెంట్లు, పార్టీలకు వేసవి కాలం అనుకూలంగా మారడంతో వీకెండ్స్‌లో బీర్ డిమాండ్ మరింత పెరుగుతోందని ట్రేడర్లు చెబుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు బీర్ల అమ్మకాలు పెరుగుతున్నాయి. గత నెల నుంచే బీరు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే బీరు విక్రయాలు 30 శాతం మేరకు పెరిగాయి. వచ్చే రెండు మాసాల్లో ఎండలు మరింత పెరగనుండటతో సేల్స్ కూడా భారీగా పెరుగుతాయని అంచనా వేస్తున్నాయి ఎక్సైజ్ వర్గాలు. ఏపీలో మార్చి నెలలో 29.8 శాతం మేరకు అధికంగా బీర్లు అమ్ముడైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి వినియోగదారులు లిక్కర్ కంటే బీర్లకే మొగ్గుచూపుతున్నారు మందుబాబులు. గతేడాది ఏప్రిల్‌లో 12 వరకు 11.78 లక్షల కేసుల మద్యం అమ్మగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇప్పటి వరకు 8.52 లక్షల కేసుల మద్యమే అమ్ముడైంది. మార్చిలో సుమారు 26.11 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. గతేడాది మార్చిలో కేవలం 20 లక్షల కేసులు మాత్రమే. అంటే దాదాపు 30% వృద్ధి నమోదైంది. ఏప్రిల్ మొదటి 12 రోజుల్లోనే 9.2 లక్షల కేసుల బీర్లు



సేల్ అయ్యాయి. గతేడాది ఇదే సమయానికి 8.16 లక్షల కేసులు మాత్రమే అమ్ముడయ్యాయి. తెలంగాణతో పోలిస్తే ఏపీలో బీర్ల వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ, ఈ ఏడాది వృద్ధి రేటు ఏపీలోనే ఎక్కువగా వుంది. ఎండల తీవ్రత పెరగడం వల్ల ప్రజలు లిక్కర్ నుంచి బీర్లకు షిఫ్ట్ అవ్వడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా 28.4 శాతం వృద్ధి సాధించింది. శ్రీసత్యసాయిలో 27.75 శాతం, కర్నూలులో 26.03 శాతం అమ్మకాలు పెరిగాయి.

బీర్ సేల్స్ పెరగడంతో లిక్కర్ వినియోగం మాత్రం గణనీయంగా తగ్గిపోయింది. గత ఏడాది ఏప్రిల్‌లో 11.78 లక్షల కేసుల మద్యం అమ్ముడైతే... ఈ ఏడాది ఏప్రిల్‌లో అది కేవలం 8.52 లక్షల కేసులకు పడిపోయింది. అంటే లిక్కర్ అమ్మకాలు 27.64 శాతం తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి. సాధారణంగా ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి బీర్ డిమాండ్ పెరుగుతుంది. కానీ ఈసారి మాత్రం ట్రెండ్ ముందుగానే మారింది. మార్చి నుంచే బీర్ మార్కెట్ పీక్‌లోకి వెళ్లింది. ఇప్పటివరకు తెలంగాణతో పోలిస్తే ఏపీలో వినియోగదారులు ఎక్కువగా హార్డ్ లిక్కర్‌కే మొగ్గు చూపేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ఎండలు పెరిగిన వెంటనే బీర్ కొనుగోలు చేసే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలను దాటేశాయి. ఏప్రిల్ చివరి వారంలో, మే నెలలో మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఇప్పుడే బీర్ అమ్మకాలు టాప్ గేర్‌లో ఉంటే... వచ్చే వారాల్లో మరింత పీక్‌కు చేరే అవకాశం ఉందని మద్యం వ్యాపారులు అంచనా వేస్తున్నారు. డిమాండ్ తగ్గట్లు సప్లయ్ ఉంటుందా అనేది టెన్షన్ పడుతోంది. కానీ ప్రస్తుతమైతే డిమాండ్ తగ్గట్టుగా ఉత్పత్తి జోరు పెరిగింది. మేలోనూ ఎలాంటి షార్టేజ్ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు అధికారులు. మొత్తంగా ఎండలతో పోటీ పడి బీర్ సేల్స్ పెరుగుతున్నాయి. టెంపరేచర్స్ పెరిగే కొద్దీ సేల్స్... రికార్డ్ స్థాయిలో వుంటున్నాయి. డిమాండ్ తగ్గట్టు సప్లయ్ ఉండేలా చూడాలని బీర్ లవర్స్ కోరుతున్నారు. కృత్రిమ కొరత సృష్టించకుండా చూడాలంటున్నారు. హాట్‌హాట్ సమ్మర్ లో చిల్ అయ్యేలా కోరిన బ్రాండ్ దొరికేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

- **రోడ్డుపైకి చేరిన చిరువ్యాపారుల బతుకులు**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 18 (ప్రజా స్వరం):**

హైకోర్టు ఆదేశాల మేరకు సికింద్రాబాద్ పరిధిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ శనివారం వేగవంతమైంది. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోన్ సిటీ ప్లానర్ సత్యభామ, కవాడిగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పుష్పలత ఆధ్వర్యంలో అధికారులు భారీ బందోబస్తు మధ్య ఈ డ్రైవ్ నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి నుంచి ముషీరాబాద్ చౌరస్తా మీదుగా పద్మారావు నగర్ పార్క్ వరకు రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన దుకాణాలు, షెడ్లను జేసీబీల సాయంతో కూల్చివేశారు. బాటసారులకు ఇబ్బంది కలగకుండా ఫుట్‌పాత్‌లను పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ముందే సూచించినా స్పందించని వారిపై కఠినంగా వ్యవహరించినట్లు సిటీ ప్లానర్ సత్యభామ ఈ సందర్భంగా తెలిపారు. మరోవైపు జీహెచ్‌ఎంసీ అధికారుల చర్యలపై చిరువ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇదే ప్రాంతంలో చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, ఇప్పుడు ముందస్తు సమాచారం లేకుండా తమ పొట్ట కొట్టడం ధర్మం కాదని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఇలా అర్ధాంతరంగా దుకాణాలను కూల్చివేస్తే తమ జీవనం ఎలా సాగుతుందని, అప్పులు తెచ్చి పెట్టుకున్న సరుకంతా పాడైపోయిందని వారు వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకుని వ్యాపారాలు చేసుకునేందుకు వేరే చోట అవకాశం కల్పించాలని బాధిత వ్యాపారులు డిమాండ్ చేశారు. ఈ తొలగింపుల సమయంలో కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకున్నప్పటికీ, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని సర్దుబాటు చేశారు.





# దేశంలో నిశ్శబ్దంగా లివర్ వ్యాధుల విస్తరణ

- **ప్రతి ముగ్గురిలో ఒకరికి ముప్పు**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 18 (ప్రజా స్వరం):**



భారతదేశంలో కాలేయ సంబంధిత వ్యాధులు నిశ్శబ్దంగా విస్తరిస్తున్నాయని, ప్రతి ముగ్గురిలో ఒకరు ఈ ప్రమాద అంచున ఉన్నారని మెడికవర్ హాస్పిటల్స్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 19న 'వరల్డ్ లివర్ డే'ను పురస్కరించుకుని శనివారం సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ చీఫ్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ విభాగం హెడ్ డాక్టర్ పవన్ అడ్డాల మాట్లాడుతూ, ప్రస్తుతం దేశంలో ఫ్యాటీ లివర్ సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని, ముఖ్యంగా యువత ఈ వ్యాధి బారిన పడటం కలవరపెడుతోందని పేర్కొన్నారు. నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (NAFLD) అనేది ఇప్పుడు అత్యంత సాధారణ వ్యాధిగా మారిందని, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం, ఊబకాయం, మధుమేహం మరియు మద్యపానం దీనికి ప్రధాన కారణాలని ఆయన వివరించారు. కాలేయ వ్యాధుల ప్రత్యేకత ఏమిటంటే ఇవి ప్రారంభ దశలో ఎలాంటి స్పష్టమైన లక్షణాలను చూపవని, వ్యాధి తీవ్రమై సిరోసిస్ లేదా లివర్ క్యాన్సర్‌కు దారితీసే వరకు చాలా మందికి తెలియదని డాక్టర్ పవన్ హెచ్చరించారు. అయితే సుమారు 70 శాతానికి పైగా లివర్ వ్యాధులను కేవలం జీవనశైలి మార్పులతోనే నివారించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమతుల్య ఆహారం, నిత్యం 30 నిమిషాల వ్యాయామం, బరువు నియంత్రణ, మద్యానికి దూరంగా ఉండటం ద్వారా కాలేయాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించేందుకు క్రమం తప్పకుండా లివర్ ఫంక్షన్ టెస్టులు చేయించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రాణదాతగా మారుతుందని తెలిపారు. 'నివారణే ఉత్తమ చికిత్స' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ తమ కాలేయ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మెడికవర్ హాస్పిటల్స్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది.

# పాఠశాలల వద్ద పొగాకు విక్రయిస్తే కఠిన చర్యలు

- **అడిషనల్ డీసీపీ నరసయ్య హెచ్చరిక**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 18 (ప్రజా స్వరం):**

విద్యాసంస్థల దరిదాపుల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపుతామని సికింద్రాబాద్ అడిషనల్ డీసీపీ నరసయ్య, చిలకలగూడ ఇన్స్పెక్టర్ రామకృష్ణ స్పష్టం చేశారు. పాఠశాలలకు వంద మీటర్ల లోపు నిబంధనలకు విరుద్ధంగా పొగాకు వస్తువులను విక్రయిస్తున్నారన్న సమాచారంతో శనివారం పోలీసులు సికింద్రాబాద్ పద్మారావు నగర్ రాంగోపాల్పేట తదితర ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పద్మారావు నగర్ ప్యారడైజ్ ప్రాంతాల్లో తన సిబ్బందితో కలిసి పాన్ షాపుల్లో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలను అతిక్రమించి విక్రయానికి సిద్ధంగా ఉంచిన సిగరెట్ బాక్సులు పాన్ మసాలా ప్యాకెట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటికి పంచనామా నిర్వహించి సీజ్ చేయడమే కాకుండా, సదరు దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు. ముఖ్యంగా మైనర్లకు ఇటువంటి హానికరమైన ఉత్పత్తులను అమ్మడం 2003 చట్టం ప్రకారం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే దుకాణదారుల పట్ల కనికరం



చూపేది లేదని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థల పరిసరాలను పొగాకు రహిత ప్రాంతాలుగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999